RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 447 | 12 బుధవారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం..

## ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం : మోదీ

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు.ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.



## పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే నిజమైన

# సంకల్పం ఉండాలి

### : రేవంత్ రెడ్డి



భవనాలు నిర్మించడం ఎవరికైనా సులభమే కావచ్చు.. కానీ పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి నిజమైన సంకల్పం ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, పేదరికం అనే అసమానతలను చెరిపేస్తూ... ప్రతీ చిన్నారికీ కార్పొరేట్‌తో సమానమైన ప్రపంచ స్థాయి విద్యను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ప్రకటించారు.రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకుంటున్న ఈ సమీకృత గురుకులాలు సాధారణ పాఠశాలలు మాత్రమే కావని... పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలని సీఎం అన్నారు. పేద పిల్లల ఉన్నత కలలకు శాశ్వత చిరునామాగా నిలుస్తూ, దేశానికే 'తెలంగాణ మోడల్' విద్యారంగానికి ప్రతీకగా నిలిచేలా ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## సరైన దుస్తులు ధరించండి

### : బనియన్, నిక్కరు తొడిగిన ఆప్ ఎమ్మెల్యేపై సీఎం రేఖా గుప్త ఆగ్రహం



ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే అనిల్ ఝా వత్స్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల ముందు, ముఖ్యంగా మహిళల సమక్షంలో ఆయన బనియన్, నిక్కరు ధరించి కూర్చున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా ఆయన ప్రవర్తనను తప్పుబట్టారు.వాయువ్య ఢిల్లీలోని కిరారి నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ ఝా, తన కార్యాలయంలో బనియన్, నిక్కరుతో కుర్చీలో కూర్చుని ఉండటం ఆ వీడియోలో కనిపిస్తోంది. ఒడిలో కాషాయ కండువా వేసుకుని, లక్ష్మీ యోజన పథకానికి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకాలు చేస్తున్నారు. ఆ సమయంలో మహిళలతో సహా పలువురు ప్రజలు ఆయన చుట్టూ క్యూలో వేచి ఉన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.సోమవారం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశాన్ని ప్రస్తావించిన ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఎమ్మెల్యే ప్రవర్తన సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. "మీ ప్రవర్తన అత్యంత విచారకరం. మహిళలు పత్రాలపై సంతకాలు చేయించుకోవడానికి వచ్చినప్పుడు కనీసం సభ్యతతో కూడిన వస్త్రధారణ ఉండాలి కదా" అని ఆమె మండిపడ్డారు. ప్రజాప్రతినిధిగా ఇలా వ్యవహరించడం ఆమోదయోగ్యం కాదని, ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు సభలో నిరసన వ్యక్తం చేశారు.

## పింగళి వెంకయ్యకు ఇచ్చే నిజమైన గౌరవం భారతరత్న మాత్రమే

### : వి. హనుమంతరావు



భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు.కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

## అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే : కేంద్రం



ఎప్పటికీ భారత్ లో అంతర్భాగమేనని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టంచేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొన్నది. ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా (జస్త్రఱఅఖ) చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ విధంగా స్పందించింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టంచేశారు.భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టంచేశారు. ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు.పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకార మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## అందుకే రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కండువా కప్పుకున్నా

### : పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్య



తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరానని, పదవుల కోసమో, డబ్బు కోసమో కాదని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రభుత్వం సగం నిధులే విడుదల చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం బిర్కూర్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని పోచారం తెలిపారు. గత నవంబర్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఇదే విషయాన్ని తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. ఆరు నెలల్లోగా బిల్లులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం సగం నిధులే విడుదలయ్యాయని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిగతా మొత్తాన్ని మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు.

## మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్‌లో యాంజియోగ్రఫీ, గుండె రక్తనాళాల్లో బ్లాకేజీలను గుర్తించడంలో దాని ప్రాముఖ్యత, అలాగే సకాలంలో గుండె పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు.

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
ఈ కార్యక్రమంలో డా. సంతోష్, డా. శ్రవణ్, డా. షఫీ పాల్గొని యాంజియోగ్రఫీకి సంబంధించిన ముఖ్యమైన విషయాలను వివరించి, గుండె ఆరోగ్యంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.వైద్యులు యాంజియోగ్రఫీ అంటే ఏమిటి, అది ఎందుకు చేస్తారు, ఎలాంటి పరిస్థితుల్లో చేయించుకోవాల్సి వస్తుందో వివరించారు. ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుండె వైద్యులను సంప్రదించాలని సూచించారు.గుండె రక్తనాళాల్లో బ్లాకేజీలను ముందుగానే గుర్తించడం ద్వారా సరైన సమయంలో చికిత్స అందించి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని తెలిపారు. యాంజియోగ్రఫీ చేయాలా వద్దా అనే నిర్ణయం రోగి లక్షణాలు, వైద్య చరిత్ర, ప్రమాద కారకాలు మరియు ఇతర గుండె పరీక్షల ఫలితాల ఆధారంగా తీసుకుంటారని వివరించారు.మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం, కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర, శారీరక శ్రమ తక్కువగా ఉండటం వంటి ప్రమాద కారకాలు ఉన్నవారు తమ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యులు సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు




చేయించుకోవడం, అవసరమైనప్పుడు కార్డియాలజిస్టును సంప్రదించడం ద్వారా గుండె సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు.కొన్నిసార్లు గుండెపోటు స్పష్టమైన లక్షణాలు లేకుండానే రావచ్చని వైద్యులు హెచ్చరించారు. కొంతమందిలో గుండె రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకేజీలు ఉన్నప్పటికీ సాధారణ లక్షణాలు కనిపించకపోవచ్చు. అందువల్ల లక్షణాలు లేవని నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన సమయంలో గుండె పరీక్షలు చేయించుకోవడం ద్వారా దాగి ఉన్న గుండె సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని వివరించారు.ఈ ప్రెస్ మీట్‌లో యాంజియోగ్రఫీ ఎలా చేస్తారు, దాని భద్రత, గుండె రక్తనాళాల బ్లాకేజీలను గుర్తించడంలో దాని పాత్ర, అలాగే సరైన సమయంలో వైద్య నిర్ణయం తీసుకోవాల్సిన ప్రాముఖ్యత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ సెంటర్ హెడ్ నమ్రతతో పాటు ఆసుపత్రి సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ ప్రజల్లో యాంజియోగ్రఫీపై సరైన అవగాహన పెంపొందించి, లక్షణాలు తీవ్రంగా మారే వరకు వేచి చూడకుండా గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సందేశం ఇచ్చింది. అలాగే అనుభవజ్ఞులైన కార్డియాలజీ నిపుణుల పర్యవేక్షణలో ఆధునిక గుండె పరీక్షలు, ఖచ్చితమైన నిర్ధారణ, సమయానుకూల చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు.

## క్యామ మల్లేశ్‌ను పరామర్శించిన కేటీఆర్.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:-
ఇబ్రహీంపట్నం: ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్యామ మల్లేశ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న క్యామ మల్లేశ్ నివాసానికి మంగళవారం వెళ్లిన కేటీఆర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కొద్దిసేపు క్యామ మల్లేశ్‌తో మాట్లాడిన కేటీఆర్, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉంది, వైద్యులు అందిస్తున్న చికిత్స, తీసుకుంటున్న విశ్రాంతి తదితర వివరాలను తెలుసుకున్నారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే క్యామ మల్లేశ్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. క్యామ మల్లేశ్‌ను కేటీఆర్ పరామర్శించడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

## ఇందిరా మహిళా శక్తితో మహిళల సాధికారతకు మరింత బలం..

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు అన్నారు.మంగళవారం గుండ్లసింగారం షిరిడీ సాయి ఫంక్షన్ హాల్లో 2వ డివిజన్ కు చెందిన మహిళలకు ఇందిర మహిళా శక్తి చీరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.మహిళల అభ్యున్నతీ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మహిళ శక్తితో కుటుంబం అభివృద్ధి సాధిస్తుందని, మహిళలు స్వసక్తితో ఆర్థికంగా పురోగతి సాధించాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగులాల్,మాజీ మండల అధ్యక్షులు అజయ్,మాజీ డివిజన్ అధ్యక్షులు రవి,పొన్నాల రఘు,వంగపహడ్ గ్రామ చైర్మెన్ మెరుగు రాజేష్ గౌడ్,గ్రంథాలయ



మాజీ డైరెక్టర్ సముద్రాల మధు,సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి,గాదె రాజయ్య, నామిండ్ల భాస్కర్,ములుగు వంశీ,రేణుకుంట్ల రాజేష్,సునీత,జనరల్ సెక్రెటరీ జీవన్,మండల,డివిజన్ ముఖ్య నాయకులు,నాయకులు కార్యకర్తలు,మహిళలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పోయిన ఫోన్లు..

### పోలీసుల చొరవతో తిరిగి చేతికి!



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:-
తలకొండపల్లి:పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో తలకొండపల్లి పోలీసులు ప్రత్యేక చొరవ చూపారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన 10 సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని బాధితులకు తిరిగి అప్పగించారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జాషువా, కేంద్ర పరికరాల గుర్తింపు నమోదు వ్యవస్థ ద్వారా అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించారు. సాంకేతిక ఆధారాలతో వివరాలను పరిశీలిస్తూ సెల్‌ఫోన్ల ఆచూకీని గుర్తించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫోన్లను గుర్తించి రికవరీ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు.రికవరీ చేసిన 10 సెల్‌ఫోన్లను తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌస్ అధికారి వి. జానకిరామ్‌రెడ్డి, ఉప పరిశీలకుడు కె. శేఖర్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. తమ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ అధికారి జానకిరామ్‌రెడ్డి మాట్లాడుతూ, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించేందుకు కేంద్ర పరికరాల గుర్తింపు నమోదు వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించిన క్రైమ్ కానిస్టేబుల్ జాషువాను అభినందించారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం, బాధితులకు న్యాయం చేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణతో పాటు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, సెల్‌ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పాల్గొన్నారు.

## త్రివర్ణ పతాకాలతో కదిలిన బి.ఎన్.రెడ్డి.. ఘనంగా తిరంగయాత్ర

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:-
హైదరాబాద్:దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ వనస్థలిపురం బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తిరంగయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, కాటం క్రాంతి గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.త్రివర్ణ పతాకాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో సందడి చేశారు. బి.ఎన్.రెడ్డి డివిజన్‌లో ప్రధాన వీధుల మీదుగా సాగిన యాత్రలో దేశభక్తి భావన వెల్లివిరిసింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రభారి, ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, తాజా మాజీ కార్పొరేటర్ మోదు లచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే కొప్పుల నరసింహారెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, నూటి శ్రీనివాస్, తడకమళ్ల విజయకుమార్, చిట్టిపోల్ రవికుమార్, శ్రీధర్ రావు, రవి శంకర్, ప్రేమనాథ్, భూపాల రెడ్డి, పవన్ రెడ్డి, శరత్ కుమార్, సురేష్, మహేష్‌తో పాటు రాష్ట్ర యువ మోర్చా నాయకులు భార్గవ్ తేజ, సాయిరాం గౌడ్, చరణ్, చైతన్య గౌడ్, అభినందన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం భారతదేశ గౌరవం, స్వాతంత్ర్యం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.




యువతలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల లక్ష్యమన్నారు. “తిరంగం మన గౌరవం.. భారత్ మన గర్వం” నినాదంతో యాత్ర విజయవంతంగా ముగిసింది.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి సమన్వయమే కీలకం

### ప్రతి గ్రామానికి స్పష్టమైన ప్రణాళిక ఉండాలి: అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:-
రంగారెడ్డి జిల్లా: గ్రామాల సమగ్ర అభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. గ్రామాల వాస్తవ అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, నిధులను సమర్థవంతంగా అనుసంధానం చేసి ప్రజలకు గరిష్ట ప్రయోజనం కల్పించాలని సూచించారు.మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, 202627 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికలతో పాటు జల సంరక్షణ, వనమహోత్సవం, పారిశుధ్యం తదితర అంశాలను ఆమె సమీక్షించారు.ప్రతి గ్రామానికి సంబంధించిన జనాభా, తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పారిశుధ్యం, నీటి వనరులు, మౌలిక వసతుల వివరాలతో సమగ్ర సమాచార పత్రాన్ని సిద్ధం చేయాలని తెలిపారు.



గ్రామ సభలు, క్షేత్రస్థాయి పరిశీలనల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు.జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు వ్యవసాయ చెరువులు, ఇంకుడు గుంతలు, నీటి నిల్వ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. వనమహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి మురుగు



కాలువలు, నీటి నిల్వలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను శుభ్రం చేయాలని అన్నారు. దోమల నివారణతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రణాళికలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## బాలాపూర్ చౌరస్తాలోని కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్న సామిడి గోపాల్ రెడ్డి



( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 11:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బోనాల పండుగ సందర్భంగా బాలాపూర్ చౌరస్తా లోని కట్ట మైసమ్మ తల్లి దేవాలయాన్ని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి అన్న వారితోపాటు బాలాపూర్ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ వరికుప్పల శివ స్టేట్ సెక్రటరీ సామిడి చరణ్ రెడ్డి ఎక్స్ కోఆప్షన్ సభ్యులు జటావత్ రవి నాయక్ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు నక్క బాలకృష్ణ గౌడ్ దేరంగుల వంశి టెక్నో కృష్ణ గడివేముల కృష్ణ లక్ష్మా చారి లోకేష్ వరుణ్ వివేక్ చిన్న తదితరులు యొక్క కార్యక్రమం పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక · hyderabadestate.co.in
12 బుధవారం ఆగస్టు 2026

# కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు...

## చలివాగు నీటిని విడుదల చేయాలి, పంటలను ఆదుకోవాలి, రైతులను కాపాడుకోవాలి...

### :-మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు..



హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
తేది:11.08.2026 రేగొండ మండలం.

రేగొండ మండలం,చెన్నపూర్ I రోడ్డు జాతీయ రహదారి పై రైతులు చలివాగు ప్రాజెక్ట్ నుండి నీటిని విడుదల చేయాలని చేస్తున్న రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్ని, రైతులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు మరియు వారితో పాటు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు.అనంతరం శాయంపేట మండలం, జోగంపల్లి గ్రామంలోని చలివాగు ప్రాజెక్ట్ మరియు పంపుహౌస్ లను సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

చలివాగు ప్రాజెక్ట్ తూములు లేపి నీళ్లు వదిలి, ఆయకట్టు ప్రాంత పంట పొలాలకు నీళ్లు ఇయ్యాలని చెప్పి, దాదాపుగా మేము 15, 20 రోజుల నుంచి అడుగుతున్న ఈ ప్రభుత్వానికి చలనం లేదు. చీమ కుట్టినట్టు కూడా అయితలేదు. ఇక్కడి నుంచి మోటార్ల వేసి పైకి నీళ్లు తీసుకుపోతున్నారు, మా పంట పొలాలకు నీళ్లు ఇస్తలేరు కాబట్టి మా రైతులందరూ కూడా ఈరోజు తీవ్రమైనట్టువంటి మనోవేదనలో ఉన్నారు. రైతన్నలు నార్లు పోసి 45 రోజులు అయ్యింది, నార్లు పెరిగి ఉన్నాయి.నీళ్లు ఇస్తే నాటేసుకోవాలి. కానీ ఈ ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుండా  మీనవేషాలు లేక్కిస్తున్నారు కాబట్టి ఈరోజు చివరిగా ప్రభుత్వానికి హెచ్చరిక చేయడం కొరకు ఈరోజు రాస్తారోకో చేశాం.ఇది ఇంతటితో ఆగదు. తక్షణమే గనక స్థానిక శాసన సభ్యుడు 24 గంటల లోపు నీళ్లు గనక వదలకపోతే, ఎమ్మెల్యే గ్రామాలకు వస్తే నిలదీస్తాం, ఎక్కడికక్కడ నడవకుండా చేస్తాం అని ఈరోజు రైతులు హెచ్చరిక చేస్తున్నారు కాబట్టి, వాళ్ళ డిమాండ్ ప్రకారం తక్షణమే నీళ్లు ఇయ్యాలి, పంట పొలాలకు నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలి. ఈరోజు ప్రభుత్వం ద్వంద విధానాలు అవలంబిస్తున్నది. స్టేషన్ ఘన్పూర్ నియోజక వర్గానికి వారు అక్కడ రైతులకు అఫీషియల్‌గా పంటలు ఇస్తారు, ఇక్కడనేమో మా రైతుల పంట పొలాలు ఎండగోడుతున్నారు, ఇది ఏం ధర్మం, ఇది ఏమి న్యాయం అని చెప్పి రైతులు ప్రశ్నిస్తున్నారు.ఈరోజు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే,ఖచ్చితంగా 9 పంపులను ఆన్ చేయాలి,9 పంపులు నడిపియ్యాలి,పంట పొలాలకు నీళ్లు ఇయ్యాలి,అందరికీ నీళ్లు ఇయ్యాలి అని కోరుకుంటున్నాం.మేము రైతులం మా పంట పొలాలు పండాలే,పక్కోలది కూడా పండాలని కోరుకుంట్టాం.కానీ ప్రస్తుతం 5 లేదా 6 పంపులు మాత్రమే నడుస్తున్నాయి, ఎందుకు అంటే రిపేర్ అని ఒకసారి, ఎలక్ట్రిసిటీ ప్రాబ్లం అని కారణాలు చెప్తున్నారు.

9 పంపులు నడిస్తే నెలకు 6 టీఎంసిల నీళ్లు పంపింగ్ అవుతాయి అంటే 6 నెలలకు 36 టీఎంసిలు నీళ్ళు పంపింగు జరిగితే గనక ఎక్కడ కూడా పంట పొలం ఎండదు, తాగునీటి సమస్య రాదు.కాబట్టి ఇవన్నీ కూడా చేయాలని చెప్పి ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం.చేయకపోతే ఇయ్యాల ఈ ఒక్క రాస్తారోకో తో ఆగదు. ఈ కార్యక్రమం రేపు ఉంటది, ఎల్లుండి ఉంటది. ఖచ్చితంగా ఈ ప్రభుత్వం దిగి వచ్చే వరకు మా కార్యక్రమం ఉంటది. రైతులను ఏడిపించిన పాలకులు కాలగర్భంలో కలిసిపోయారు. రైతు ఏడిచిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన  ముందు పడదు. ఇప్పటికే రైతులు ఏడుస్తున్నారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని ఏద్దేవా చేశారు అని చెప్పి రైతులు గగ్గోలు పెడుతున్నారు.

రేవంత్ రెడ్డి నువ్వు ఏదో కొంగ జపం చేసినట్టు, ఇప్పుడు ఏదో వాన కావాలని యాగాలు చేస్తే వానలు పడవు.గోదావరి పోతుంటే చూస్తున్నావ్, కృష్ణా ప్రవహిస్తుంటే చూస్తున్నావ్, పంట పొలాలు ఎండిపోతుంటే చూస్తున్నావ్. ఇకనైన ఇప్పటికైనా ప్రభుత్వం మరి సరియైనటువంటి విధానాలు అవలంబించి, పంపులు ఆన్ చేయాలి అని డిమాండ్ చేశారు.

# పనికి దక్కని ఫలితం

## - పరిశుభ్రత లో పంచాయతీ కార్మికుల కీలకపాత్ర
## - పెరుగుతున్న పని భారం.. అందని కనీస వేతనం
## - కష్టంగా కుటుంబ పోషణ
## - హామీలు అమలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి) పంచాయితీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మల్టీపర్పస్ వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు పరిశుభ్రత నిర్వహణ చెత్త సేకరణ డ్రైనేజీలు శుభ్రపరచడం తాగునీటి సరఫరా పర్యవేక్షణ మొక్కల సంరక్షణ ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలు పాల్గొనడం వంటి అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నారు గ్రామాల్లో అభివృద్ధి పారిశుద్ధానికి వెన్నుముకగా నిలుస్తున్న పంచాయతీ కార్మికులకు పెరుగుతున్న పని బాలానికి సమానంగా జీతాలు మాత్రం పెరగడం లేదు

చాలీచాలని వేతనాలు

మల్టీపర్పస్ వర్కర్లకు ప్రభుత్వం నెలకు 9500 వేతన అందిస్తుంది కొన్ని గ్రామాల్లో కేటాయించిన ఒకటే పోస్టుకు ఇద్దరు లేదా ముగ్గురు పనిచేస్తూ వచ్చే జీతం పంచుకుంటున్నారు కుటుంబ భోజనం భారంగా మారిందని పిల్లల విద్య వైద్యం నిత్యవసర వస్తువులు ఖర్చులు భరించడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్ల జీవితాలను ఆలోచించి వారి భవిష్యత్తుకు మంచి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యగిరి ఎల్లమ్మ బోనాలకు పటిష్ట ఏర్పాట్లు

## శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:-

ఆదిబట్ల: రావిరాల గ్రామంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాల ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్‌శాఖల సమన్వయ సమావేశం నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని అధికారులు పరిశీలించి భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భక్తుల క్యూలైన్లకు అవసరమైన బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. ఉత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.అదేవిధంగా ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం వంటి అంశాలపై కూడా సమీక్షించారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, దేవాదాయ శాఖ, విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉత్సవం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డీసీపీ రాజేష్ సూచించారు.

# ఇంద్రానగర్‌లో వనమహోత్సవం..

## మొక్కలు నాటిన శ్రీమతి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 59వ డివిజన్ ఇంద్రానగర్‌లో ఇంద్రానగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే గారి సతీమణి శ్రీమతి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా నీలిమా రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో వరంగల్ నగరాన్ని మరింత పచ్చగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 59వ డివిజన్ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వసంత్ మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, తెల్ల సుగుణ కిషోర్, శ్రీనివాస్ రావు, నేహాల్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆస్కార్ అందుకున్న కలం.. అక్షరాల ఆలయం కట్టింది!

## చంద్రబోస్ 'ఆస్కార్ గ్రంథాలయం'.. సొంతూరి యువతకు జ్ఞాన దీపం





హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

చల్లగరిగ నుంచి ప్రపంచ వేదిక వరకు ఎదిగిన గేయ రచయిత.. ఇప్పుడు అదే పల్లెకు అక్షర వెలుగులు పంచుతున్నారు.

ఒకప్పుడు పుస్తకాల మధ్య కూర్చొని అక్షరాలను ఆస్వాదించిన బాలుడు.. ఆ అక్షరాలనే ఆయుధంగా చేసుకుని ప్రపంచ సినీ వేదికపై తెలుగు పాటకు గౌరవం తీసుకొచ్చారు. అదే అక్షరాలపై ఉన్న ప్రేమతో ఇప్పుడు తన స్వగ్రామంలో ఓ విజ్ఞాన మందిరాన్ని నిర్మించారు

. ఆయనే ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనుకుంట్ల చంద్రబోస్.

తెలుగు సినీ పాటకు తనదైన పదసౌందర్యాన్ని అద్దిన చంద్రబోస్.. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ పురస్కారం అందుకున్నారు.

ప్రపంచ వేదికపై తెలుగు పాట సత్తాను చాటిన ఆయన.. తన విజయాన్ని కేవలం వ్యక్తిగత గౌరవంగా భావించకుండా, తనను తీర్చిదిద్దిన నేలకు ఏదో ఒకటి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో ముందుకు సాగారు.

**ఇచ్చిన మాట.. నిలబెట్టుకున్న బోస్**

ఆస్కార్ అవార్డుతో స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు వెళ్లిన సమయంలో గ్రామస్థులు చంద్రబోస్‌ను ఘనంగా సత్కరించారు.

తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఆయన.. గ్రామంలోని గ్రంథాలయంతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. తన సాహితీ ప్రయాణానికి పుస్తకాలు, గ్రంథాలయం ఎంతో ఉపయోగపడ్డాయని చెబుతూ.. గ్రామంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త గ్రంథాలయాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

ఆ మాటను ఆచరణలో పెట్టి సొంత నిధులతో 'ఆస్కార్ గ్రంథాలయం' నిర్మించారు. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో, రెండు అంతస్తులతో ఈ గ్రంథాలయ భవనాన్ని నిర్మించినట్లు అప్పటి నివేదికలు పేర్కొన్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచేలా దీనిని తీర్చిదిద్దారు.

**ఒక పుస్తకం.. ఒక జీవితాన్ని మార్చగలదు**

చంద్రబోస్ జీవితంలో పుస్తకాలకు ఉన్న స్థానం ఎంతో ప్రత్యేకం. చిన్నతనంలో తన ఇంటి సమీపంలోని గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు చదివానని, ఆ పఠనమే తన ఎదుగుదలకు ఎంతో తోడ్పడిందని ఆయన గుర్తుచేసుకున్నారు. అందుకే తన గ్రామంలోని మరో తరం పిల్లలకు కూడా పుస్తకాల ప్రపంచాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ గ్రంథాలయాన్ని నిర్మించారు.

**ఆస్కార్ ట్రోఫీ కంటే గొప్ప కానుక**

సినీ ప్రపంచంలో ఆస్కార్ అనేది అత్యున్నత గౌరవాల్లో ఒకటి. అలాంటి అవార్డును అందుకున్న చంద్రబోస్ తన గ్రామానికి ఇచ్చిన కానుక మాత్రం మరో రూపంలో నిలిచిపోయింది. ఆస్కార్ ట్రోఫీ ఒక వ్యక్తి ప్రతిభకు గుర్తుగా నిలిస్తే.. ఆస్కార్ గ్రంథాలయం ఒక సమాజ భవిష్యత్తుకు బాటలు వేసే జ్ఞాన కేంద్రంగా నిలవాలన్నదే ఆయన ఆలోచన.

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలు, పోటీ పరీక్షల సమాచారం, సాహిత్యం, విజ్ఞానం అందుబాటులో ఉండటం ఎంతో కీలకం. అలాంటి అవసరాన్ని గుర్తించి చంద్రబోస్ చేపట్టిన ఈ ప్రయత్నం.. కళాకారులు, రచయితలు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరూ తమ సొంత ఊరికి ఏదో ఒక రూపంలో తిరిగి ఇవ్వాలనే సందేశాన్ని అందిస్తోంది.

**పల్లె నుంచి పుట్టిన పదం.. ప్రపంచాన్ని పలకరించింది**

చల్లగరిగ మట్టి, అక్కడి ప్రజల జీవనం, తెలంగాణ పల్లె భాష, నుడికారం తన రచనల్లో ప్రతిబింబిస్తాయని చంద్రబోస్ పలుమార్లు పేర్కొన్నారు. 'నాటు నాటు' పాటలోని పదాలకు కూడా తన పల్లె భాష, సంస్కృతి స్ఫూర్తిగా నిలిచిందని ఆయన చెప్పారు.

అందుకే చంద్రబోస్ ప్రయాణం కేవలం ఓ సినీ గేయ రచయిత విజయగాథ మాత్రమే కాదు. పల్లె నుంచి బయలుదేరిన ఒక కల.. అక్షరాల బలంతో ప్రపంచాన్ని చేరి.. తిరిగి అదే పల్లెకు జ్ఞాన రూపంలో చేరిన కథ.

ఆస్కార్ అవార్డు ఆయనకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చింది. కానీ తన స్వగ్రామంలో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయం.. ఆయనకు ప్రజల హృదయాల్లో మరో ప్రత్యేక స్థానం సంపాదించింది.

అక్షరాలను ప్రేమించిన కలం..
అక్షరాల కోసం ఓ ఆలయాన్ని నిర్మించింది.
ప్రపంచం ఇచ్చిన ఆస్కార్ గౌరవాన్ని..
తన ఊరి భవిష్యత్తుకు అంకితం చేసిన చంద్రబోస్ నిజంగా అభినందనీయం.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
12 బుధవారం ఆగస్టు 2026

# ఫార్మా భూములపై 'నిజమైన రైతు'కు న్యాయం: మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 11:- ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీ కోసం భూములు కోల్పోయిన అసలైన రైతులను గుర్తించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఫార్మాసిటీ భూసేకరణ సమయంలో అక్రమంగా పరిహారం పొందిన వారి వివరాలను వెలికితీసి, పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన పట్టా రైతులకు ప్లాట్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఎమ్మెల్యే అందజేశారు.ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన ఐదెకరాల్లోపు పట్టా రైతులకు టీజీఐఐసీ ఆధ్వర్యంలో మీర్‌ఖాన్‌పేట్‌లో 121 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. తొలిదశలో 389 మంది రైతులకు డాక్యుమెంట్లు అందజేస్తున్నామని చెప్పారు.గతంలో భూసేకరణ సమయంలో రైతులకు





తగిన పరిహారం అందలేదని, కొందరు మధ్యవర్తులు నకిలీ పత్రాలతో భారీగా పరిహారం పొందారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన రైతులకు మాత్రమే ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఫార్మాసిటీ స్థానంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకు అండగా నిలిచి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఇంకా రెండు వేల మందికి పైగా రైతులకు ప్లాట్ డాక్యుమెంట్లు అందించాల్సి ఉందని, అసైన్డ్ భూముల విషయంలో పాత పహాణీల ఆధారంగా అర్హులను గుర్తిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు.

# తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం సమావేశం

## మహేశ్వరం నియోజకవర్గము ఇన్చార్జ్ షేక్ హాజీ బాబా



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 11:) రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ లో తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ అబ్దుల్ అజీమ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ. తెలంగాణలోని ప్రతి ఒక టైలర్ తెలంగాణ లేబర్ వెల్ఫేర్ బోర్డులో సభ్యత్వం తీసుకొని ఆరోగ్య సహాయం పొందాలని అన్నారు మరియు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పిఎంజిజిపి ప్రధానమంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ప్రోగ్రాం. అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా రాష్ట్ర కార్యవర్గంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ అసోసియేషన్ చైర్మన్ సయ్యద్ అబ్దుల్ అజీమ్. ప్రధాన కార్యదర్శి మీర్ అక్రమ్ అలీ. కార్యదర్శి మొహమ్మద్ ఎజాస్. కోశాధికారి మహమ్మద్ మజీద్. మహిళా కార్యదర్శి సార బోయిన జ్యోతి. సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మొహమ్మద్ సమీయుల్లా. తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి షేక్ హాజీ బాబా. అసోసియేషన్ సభ్యులు మొహమ్మద్ సమీయుల్లా ఖాన్. మహమ్మద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# మాడ వీధుల్లో శ్రీవారి పల్లకీ ఊరేగింపు

## గజరాజుల నడుమ స్వామివారి ఊరేగింపు.. మంగళహారతులతో భక్తుల స్వాగతం

తిరుమల, ఆగస్టు 11 హైదరాబాద్ ఎస్టేట్: తిరుమల మాడ వీధుల్లో శ్రీవేంకటేశ్వరస్వామివారి పల్లకీ ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయం చుట్టూ ఉన్న నాలుగు మాడ వీధుల్లో సాగిన ఊరేగింపులో గజరాజులు ముందుగా నడవగా, వాటి వెనుక పల్లకీపై శ్రీవారి ఉత్సవమూర్తిని ఆలయ అర్చకులు, సిబ్బంది తీసుకెళ్లారు. మంగళవాయిద్యాల నడుమ సాగిన ఊరేగింపులో భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. పల్లకీ తమ ముందుకు వచ్చిన సందర్భంగా పలువురు మహిళలు మంగళహారతులు సమర్పించారు. గజరాజుల నడక, మంగళవాయిద్యాల నాదం, భక్తుల గోవింద నామస్మరణతో మాడ వీధుల్లో భక్తిభావం నెలకొంది. పల్లకీపై కొలువైన శ్రీవారి ఉత్సవమూర్తిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపించారు. ఆలయ దర్శనంతో పాటు మాడ వీధుల్లో పల్లకీ ఊరేగింపును వీక్షించడం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించింది. భక్తుల మధ్యగా పల్లకీపై స్వామివారి ఊరేగింపు



తిరుమల మాడ వీధుల్లో శ్రీవారి పల్లకి ఊరేగింపు
గజరాజుల నడుమ శ్రీవారిని పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళహారతులతో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని సేవించుకున్నారు.

సాగడం తిరుమల ఆలయ సంప్రదాయాల్లోని ప్రత్యేకతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో నేతాజీ సర్వీస్ టీం అధ్యక్షుడు మొగసాని శంకర్, వరంగల్ జిల్లా జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్, యశ్వంత్, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చేయూత పింఛన్‌కు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

## పత్రాలు సిద్ధం చేసుకోవాలని దాడి శివ సూచన



గీసుగొండ, ఆగస్టు 11 హైదరాబాద్ ఎస్టేట్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పథకానికి అర్హత ఉంటే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. దరఖాస్తు కోసం అప్లికేషన్ ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అర్హత ఉన్న వారు పత్రాలను సమకూర్చుకుని దరఖాస్తు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని దాడి శివ కోరారు. పథకానికి అర్హత ఉన్న ఏ ఒక్కరూ అవకాశం కోల్పోకుండా వివరాలను తెలుసుకుని ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# ట్రిబ్యునళ్ల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి

## - కేసుల జాప్యానికి అడ్డుకట్ట వేయాలి.. - అన్ని ప్రాంతాల్లో బెంచ్‌లు ఏర్పాటు చేయాలి

## - ఎంపీ వద్దిరాజు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 హైదరాబాద్ ఎస్టేట్: ట్రిబ్యునళ్లలో ఖాళీలను వెంటనే భర్తీ చేసి, పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. న్యాయం ఆలస్యమైతే దాని ప్రయోజనం ప్రజలకు దక్కదని, ట్రిబ్యునళ్లను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అన్నారు. ట్రిబ్యునల్స్ రిఫార్మ్స్2026 బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో రవిచంద్ర మాట్లాడారు. జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు, పరిపాలన బలోపేతం, నియామకాల్లో పారదర్శకత, సేవా నిబంధనల్లో ఏకరూపత వంటి ప్రతిపాదనలను స్వాగతించారు. అయితే బిల్లు ఉద్దేశం నెరవేరాలంటే సంస్కరణలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని అన్నారు. పలు ట్రిబ్యునళ్లలో సభ్యులు, సిబ్బంది కొరతతో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని రవిచంద్ర సభ దృష్టికి తెచ్చారు. ఖాళీలను కాలపరిమితిలోగా భర్తీ చేయడంతో పాటు నియామకాల్లో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని, అర్హత, ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ స్వతంత్రంగా, సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రిబ్యునళ్ల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించి జవాబుదారీతనం పెంచాలని అన్నారు. జాతీయ ట్రిబ్యునల్స్ డేటా గ్రిడ్ ద్వారా కేసుల వివరాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. న్యాయం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో ట్రిబ్యునల్



బెంచ్‌లు ఏర్పాటు చేయాలని రవిచంద్ర కోరారు. ప్రజలకు సమీపంలోనే న్యాయ సేవలు అందుబాటులోకి రావాలని అన్నారు. త్వరితగతిన, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండే న్యాయ వ్యవస్థ నిర్మాణమే న్యాయ సంస్కరణల లక్ష్యంగా ఉండాలని రవిచంద్ర పేర్కొన్నారు. బిల్లు లక్ష్యాలను బీఆర్ఎస్ సమర్థిస్తోందని, సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు సత్వర న్యాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. 1300 మంది పోలీసులతో కీలక భేటీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం.ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

# పరకాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## - సీఎం పర్యటనలో సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

## - ఎస్ఎఫ్ఐ

పరకాల, ఆగస్టు 11 హైదరాబాద్ ఎస్టేట్: ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల పర్యటన సందర్భంగా పట్టణంలోని విద్యారంగ సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ కోరారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరకాల పట్టణానికి నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాల మంజూరు చేయాలని కళ్యాణ్ కోరారు. పరకాల పట్టణంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని, ఆత్మకూరు ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి కూడా స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కళాశాలలో తక్షణమే అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో




ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని కళ్యాణ్ కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ముఖ్యమంత్రి పరకాల పర్యటన సందర్భంగా విద్యారంగ సమస్యలను పరిశీలించి, నర్సింగ్, మెడికల్ కళాశాలలు, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మౌలిక వసతులు, ఫీజు బకాయిలు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల భవనాల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ కోరింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, జిల్లా కమిటీ సభ్యుడు సన్నీ, పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యదర్శి రేవంత్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పోలీసులతో ర్యాలీలా?

## : వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు



నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు.పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# పార్లమెంటులో బిల్లుల ఆమోద ప్రక్రియపై విస్తృత చర్చ జరగాలి

## - SC/ST\T, పేదలు, బలహీన వర్గాల హక్కులకు రక్షణ కల్పించాలి

## - బిల్లులను హడావుడిగా ఆమోదించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు:

## - డా. పిట్టా వరప్రసాద్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి విజయవాడ, ఆగస్టు 11, 2026:
2026 ఆగస్టు 10న పార్లమెంటులో పలు కీలక బిల్లులపై జరిగిన చర్చలు, ఆమోద ప్రక్రియ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన చర్చకు దారితీస్తున్నాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. ప్రజల జీవితాలపై, హక్కులపై, న్యాయ వ్యవస్థపై ప్రభావం చూపే ముఖ్యమైన బిల్లులను పార్లమెంటులో తగినంత సమయం కేటాయించి చర్చించిన తర్వాతే ఆమోదించాలని ఆయన కోరారు.

డిజిటల్ బ్యాంకింగ్ రికార్డులకు చట్టబద్ధత
దీుఅనివతీం' దీశీశీనిం జుజఆంవఅవ దీఅశ్రీశ్రీ, 2026 ద్వారా డిజిటల్, ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ రికార్డులను న్యాయపరమైన ఆధారాలుగా గుర్తించే విధంగా చట్టాన్ని ఆధునీకరించే ప్రయత్నం జరిగిందని డా. వరప్రసాద్ తెలిపారు. ఈ బిల్లు 1891 నాటి చట్టాన్ని భర్తీ చేయడానికి ఉద్దేశించబడింది. రాజ్యసభ కూడా ఆగస్టు 10న బిల్లును ఆమోదించింది.డిజిటల్ ఆధారాలకు చట్టబద్ధత కల్పించడం అవసరమే అయినప్పటికీ, సామాన్య ప్రజల బ్యాంకింగ్ డేటా, వ్యక్తిగత సమాచార భద్రత, సైబర్ మోసాల నుంచి రక్షణ వంటి అంశాలపై కూడా స్పష్టమైన భద్రతా వ్యవస్థ ఉండాలని ఆయన అన్నారు.

ట్రిబ్యునళ్ల స్వతంత్రతను కాపాడాలి
Tribunals Reforms Bill, 2026 ద్వారా దేశంలోని ట్రిబ్యునళ్ల నియామకాలు, పదవీకాలం, సేవా నిబంధనలు, పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రతిపాదించబడ్డాయని ఆయన తెలిపారు.ట్రిబ్యునళ్లలో ఎస్సీ/ఎస్టీలు, పేదలు, కార్మికులు, రైతులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు సంబంధించిన అనేక కేసులు పెండింగ్‌లో ఉంటాయని, అందువల్ల ట్రిబ్యునళ్ల స్వతంత్రత, పారదర్శకత, న్యాయ ప్రాప్తి విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని డా. వరప్రసాద్ స్పష్టం చేశారు.
ముఖ్యమైన బిల్లును తగిన చర్చ లేకుండా ఆమోదించడం సరైన పార్లమెంటరీ సంప్రదాయం కాదని ఆయన అన్నారు. ఆగస్టు 10న లోక్‌సభ ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

SC/ST హక్కులపై ప్రత్యేక పరిశీలన అవసరం
పార్లమెంటులో ఆమోదించే ప్రతి చట్టాన్ని భారత రాజ్యాంగంలోని సామాజిక న్యాయం, సమానత్వం, రిజర్వేషన్లు, ఎస్సీ/ఎస్టీ హక్కుల కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉందని డా. వరప్రసాద్ అన్నారు.

ప్రత్యేకంగా:

- ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లకు ఎలాంటి ప్రతికూల ప్రభావం కలగకూడదు.
- ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వాలి.
- ` SC Sub`Plan, ST Sub`Plan నిధులు పూర్తిగా ఆయా వర్గాల అభివృద్ధికే వినియోగించాలి.
- గిరిజనుల భూములు, అటవీ హక్కులు, రాజ్యాంగపరమైన రక్షణలను బలహీనపరిచే చర్యలు ఉండకూడదు.
- న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లలో ఎస్సీ/ఎస్టీలకు సమర్థవంతమైన న్యాయ ప్రాప్తి కల్పించాలి.
- డిజిటల్ ప్రభుత్వ సేవల్లో సామాజికంగా వెనుకబడిన ప్రజలకు డిజిటల్ విభజన కారణంగా అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కేంద్రం కాపాడాలి

పార్లమెంటులో చర్చకు వచ్చే ప్రతి బిల్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో రాష్ట్రానికి చెందిన ఎంపీలు సమగ్రంగా పరిశీలించాలని డా. వరప్రసాద్ కోరారు.

రాష్ట్ర హక్కులు, ప్రత్యేక హోదా, నిధుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ఎస్సీ/ఎస్టీ సంక్షేమం, ఉపాధి, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన అన్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి

పార్లమెంట్ కేవలం బిల్లులను ఆమోదించే సంస్థ మాత్రమే కాదని, ప్రజల సమస్యలపై చర్చించే అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అని డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.

"ప్రజల హక్కులను ప్రభావితం చేసే చట్టాలను రూపొందించేటప్పుడు పారదర్శకత, విస్తృత చర్చ, ప్రతిపక్షాల అభిప్రాయాలకు గౌరవం, నిపుణుల సూచనలు తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, పేదలు, మహిళలు, కార్మికులు, రైతులు వంటి బలహీన వర్గాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని ఆయన అన్నారు.

దేశంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ శక్తులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని డా. పిట్టా వరప్రసాద్ పిలుపునిచ్చారు.

డా. పిట్టా వరప్రసాద్
జాతీయ కార్యదర్శి & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)

# గెలుపు తర్వాత నియోజకవర్గ యువతకు ప్రశాంత్ కిశోర్ తొలి హామీ ఇదే..



బాంకీపూర్ ఉప ఎన్నికలో విజయం సాధించిన తర్వాత తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జనసురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ యువతకు కీలక హామీ ఇచ్చారు. వచ్చే రెండేళ్లలో నియోజకవర్గానికి చెందిన కనీసం 10 వేల మంది యువతకు ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఇందుకోసం విద్యార్హతలు ఉన్న యువత బయోడేటాలు, సీవీలను తన కార్యాలయంలో అందజేయాలని కోరారు.బాంకీపూర్‌లో మంగళవారం నిర్వహించిన పలు కృతజ్ఞత సభల్లో ప్రశాంత్ కిశోర్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని తాను హామీ ఇవ్వడం లేదని చెప్పారు. అయితే తన పరిచయాలు, నెట్‌వర్క్‌ను ఉపయోగించి దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభించేలా చూస్తానని తెలిపారు.బిహార్‌లో జనసురాజ్ వ్యవస్థ బలపడిన తర్వాత ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని ప్రశాంత్ కిశోర్ అన్నారు. నియోజకవర్గంలో పిల్లల విద్యకు పునాది వేసే చర్యలు చేపడతానని చెప్పారు. నిలిచిపోయిన వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.రేషన్ కార్డు కోసం లంచం అడిగే పరిస్థితి లేకుండా చేస్తానని చెప్పారు. ఇందుకు మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. రేషన్ కార్డు ఉన్నవారికి ప్రస్తుతం అందుతున్న నాలుగు కిలోల ధాన్యాన్ని ఐదు కిలోలకు పెంచుతామని తెలిపారు. వృద్ధుల పింఛన్ సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.బాంకీపూర్ ఉప ఎన్నిక ఫలితాలతో బిహార్ రాజకీయాల్లో మార్పు కనిపిస్తోందని ప్రశాంత్ కిశోర్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్ల' గురించి కాకుండా విద్య, ఉపాధి గురించి చర్చ జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఇది ప్రజల ఓటుకున్న శక్తి అని పేర్కొన్నారు.

# లార్డ్ ఉదయ్ నాగరాజు తెలంగాణకు గర్వకారణం

## ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ గారు




బ్రిటన్ పార్లమెంటులో హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నియమితులైన తెలంగాణ కు చెందిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు గారికి మంగళవారం రోజున రాంనగర్ నిత్య బ్యాంకెట్ హాల్ నందు నిర్వహించగా సన్మాన కార్యక్రమాన్ని తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి హాజరై వారిని మెమొశీటో అందించి శుభాకాంక్షలు తెలిపారు
ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ
కరీంనగర్ జిల్లా శనిగరం గ్రామానికి చెందిన శ్రీ లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు గారికి వరంగల్‌తో విడదీయరాని అనుభవం ఉంది ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం హన్మకొండలోని నక్కలగుట్టలో జరిగింది. అనంతరం హైదరాబాద్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసం కొనసాగించి, రాంటెక్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) పూర్తి చేశారు. ఉన్నత విద్యను లండన్‌లోని ఆక్స్ఫర్డ్ బ్రూక్స్ యూనివర్సిటీలో అభ్యసించారు. కేవలం 47 సంవత్సరాల వయస్సులోనే, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు నియమితులైన తొలి వ్యక్తిగా ఆయన సాధించిన ఘనత తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా వరంగల్‌కరీంనగర్ ప్రాంత ప్రజలకు గర్వకారణం. తెలంగాణ నేల నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, బ్రిటన్ పార్లమెంటులో విశిష్ట స్థానాన్ని అలంకరించిన లార్డ్ ఉదయ్ కుమార్ నాగరాజు గారిని సత్కరించడం మనందరి గౌరవం, మన ప్రాంతానికి గర్వకారణం.ఉదయ్ గారు ఏఐ లో నిష్ణాతులు... సాంకేతికత ద్వారా వారు ప్రజలకు చేసిన సేవకు సరైన గుర్తింపు దక్కింది ఉదయ్ గారు తెలంగాణ విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఏఐ సాంకేతికతను మరింత చేరువ చేయాలని కోరారు వారిని గౌరవించుకోవడం అందరికి అదృష్టం ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన తెలంగాణ వికాస సమితి ధన్యవాదములు

# రష్యా చమురుపై ఆంక్షలు..

## ఇంధన వనరుల కోసం భారత్ కొత్త దారులు



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ఇంధన సరఫరా గొలుసులో ఆటంకాలు ఎదురవుతున్న నేపథ్యంలో, భారత ఇంధన భద్రతను పటిష్ఠం చేసేందుకు ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించినట్లు విదేశాంగ శాఖ మంగళవారం వెల్లడించింది. దేశ ప్రయోజనాలు, జాతీయ ప్రాధాన్యతల మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ అంశంపై మాట్లాడుతూ, "140 కోట్ల మంది భారతీయుల అవసరాలను తీర్చడమే మా ఇంధన భద్రత ప్రధాన లక్ష్యం. దీనికోసం ఇంధన వనరుల సమీకరణను విభిన్న దేశాలకు విస్తరిస్తున్నాం. ఏ ఒక్క దేశంపైనే ఆధారపడకుండా విభిన్న మార్గాల ద్వారా ఇంధనాన్ని సేకరించాలన్నదే మా వ్యూహం" అని వివరించారు.రష్యా నుంచి భారీగా చమురు దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారాలు కల్పిస్తూ ఆ దేశ సెనేట్ చట్టాన్ని ఆమోదించిన తరుణంలో రణధీర్ జైస్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ సుంకాల అంశంపై అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి మూసివేత వంటి భౌగోళిక రాజకీయ సవాళ్ల నేపథ్యంలో భారత్ తన వ్యూహాన్ని మార్చుకుంది. గతంలో చమురు దిగుమతుల కోసం 27 దేశాలపై ఆధారపడగా, ప్రస్తుతం ఆ సంఖ్యను 41కి పెంచుకుంది. ముఖ్యంగా రష్యా నుంచి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. జులై నెలలో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా వాటా రష్యాదే కావడం గమనార్హం. అదేవిధంగా, ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) దిగుమతులను కూడా 6 దేశాల నుంచి 15 దేశాలకు విస్తరించింది. ప్రస్తుతం అమెరికా నుంచి భారీగా ఎల్ఎన్‌జీ భారత్‌కు చేరుతోంది.దేశ ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీరుతున్నందున, సరఫరాలో ఆటంకాలు కలగకుండా వనరులను వైవిధ్యీకరించడం అత్యవసరమని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సోమవారం పార్లమెంటుకు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఆనం అంటేనే అవినీతి

## : మేకపాటి విక్రమ్ రెడ్డి



ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ప్రశ్నించడమే పెద్ద పాపమన్నట్లుగా అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్నారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నియోజకవర్గంలో మేకపాటి కుటుంబానికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఉందని, తమ అభిమానులను, సానుభూతిపరులను ఉద్దేశించి మంత్రి నీచమైన వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. ఆనం గెలిచినప్పటి నుంచి ఆత్మకూరులో ఇసుక దందా, చికెన్ వేస్ట్ మాఫియాలు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయని, మర్రిపాడులో ఇసుక కొండనే మాయం చేశారని విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. మంత్రి ధనదాహానికి ఏడుగురు బలికావడమే కాకుండా, చివరకు పోలీస్ స్టేషన్ల నుంచే మామూళ్లు వసూలు చేసే నీచ సంస్కృతికి తెరతీశారని దుయ్యబట్టారు. ఐదేళ్లకోసారి పార్టీలు మారే ఊసరవెల్లి నైజం ఆనందేనని, జగన్‌ను తిట్టి మంత్రి పదవి తెచ్చుకున్న చరిత్రహీనుడని ఎద్దేవా చేశారు. కేవలం ఇసుక దందా ద్వారానే నెలకు రూ.3 కోట్లు ఆర్జిస్తున్నారని విమర్శిస్తూ.. "ఆనం అంటే అవినీతి, అవినీతి అంటే ఆనం" అని అభివర్ణించారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకోవడానికైనా, రాజీనామా చేయడానికైనా సిద్ధమని, ఈ సవాల్‌ను స్వీకరించే దమ్ము ఆనంకు ఉందా అని నిలదీశారు.

# స్టన్నింగ్ లుక్.. క్రేజీ ఫోజ్.. టాక్సిక్ బ్యూటీ గ్లామర్ కి ఫ్యాన్స్ ఫిదా!

గ్లామర్ కి సరికొత్త నిర్వచనం చూపిస్తూ.. ఎప్పటికప్పుడు ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ బాలీవుడ్ ద్యూటీ కియారా అద్వానీ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందంతో అభినయంతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఈమె లేటెస్ట్ గ్లామర్ బ్యూటీగా మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అందులో భాగంగానే ఇటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ ఆడియన్స్ ను అలరించే ప్రయత్నం చేస్తోంది కియారా అద్వానీ. గ్లామర్ లుక్ లో కియారా అద్వానీ.. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. స్టన్నింగ్ లుక్ లో క్రేజీ ఫోజులతో కుర్రకారు గుండెల్లో గుణపాలు దించేసింది. తాజాగా ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఈ అవుట్ ఫిట్ అభిమానులను ఆకట్టుకోవడమే కాకుండా ఫ్యాషన్ ప్రియులకు సరికొత్త అనుభూతిని కలిగించింది. కియారా ధరించిన డ్రెస్ విషయానికి వస్తే.. మాస్కోకి చెందిన సే నో మోర్ లేబోల్ నుండి చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఐవరీ కోఆర్డ్ ఎన్సెంబుల్ డ్రెస్ తో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది.ఆకట్టుకుంటున్న లేటెస్ట్ అవుట్ ఫిట్.. పెప్లమ్ ప్రిల్స్ తో నడుమ భాగంలో డిజైన్ చేసిన ఈ టాప్ భుజాల నుండీ కార్సెట్ జారుతున్నట్టు డిజైన్ చేసిన ఈ టాప్ చాలా ట్రెండీగా నిలిచింది. ఇక దీనికి కాంబినేషన్లో బాటమ్ గా అదే ఐవరీ కలర్ తో మ్యాక్సీ స్కర్ట్ డిజైన్ చేశారు. పైగా ఒక సైడ్ కి డీప్ కట్ తో డిజైన్ చేసిన ఈ స్కర్ట్ సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్ గా నిలిచింది. మొత్తానికైతే ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఈమె లుక్ మరింత అందంగా మారింది. టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో స్పెషల్ అట్రాక్షన్.. కియారా అద్వానీ ప్రస్తుతం ప్రముఖ లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో టాక్సిక్ అనే సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఆగస్టు 8న బెంగళూరు వేదికగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కియారా అద్వానీ తన లేటెస్ట్ లుక్ తో అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది.. ఇకపోతే టాక్సిక్ మూవీ నుండి ట్రైలర్ రిలీజ్ చేయగా.. ప్రస్తుతం ఆడియన్స్ నుంచి విపరీతమైన ఆదరణ సొంతం చేసుకుంటోంది. ఇందులో కియారా నదియా అనే పాత్ర పోషిస్తుండగా.. పైగా ఈ పాత్ర కోసం రూ.10 నుండి రూ.15 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ



సినిమాతో కియారా అద్వానీ ఖాతాలో బ్లాక్ బస్టర్ చేరడం ఖాయం అనే కామెంట్ వినిపిస్తూ ఉండడం గమనార్హం. కియారా అద్వానీ తెలుగు చిత్రాలు.. మహేష్ బాబు హీరోగా నటించిన భరత్ అనే నేను చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కియారా. ఆ తర్వాత వినయ విధేయ రామ సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. ఆ తర్వాత గత ఏడాది మళ్లీ రాంచరణ్ తో గేమ్ చేంజర్ సినిమా చేసింది కానీ ఇది కూడా డిజాస్టర్ గానే నిలిచింది.

# గౌరీ హెగ్డేగా టబు..

## 'స్లమ్ డాగ్' నుంచి స్పెషల్ గ్లింప్స్




డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనదైన శైలిలో మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. విజయ్ సేతుపతి హీరోగా 'స్లమ్ డాగ్ - 33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన టైటిల్తో ఓ ఇంట్రెస్టింగ్ మూవీని తెరకెక్కిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక కీలక అప్డేట్ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో సీనియర్ నటి టబు ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్టు ప్రకటించింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్ను విడుదల చేస్తూ, "ఆమెతో పెట్టుకోవడానికి సాహసించవద్దు" (ౖపువ'ం అశ్ౖపువ శీఅవ ఎశీబ ఝతీవ్ శీ ఎవం ఒఫ్ౖప) అనే క్యాప్షన్ను జోడించారు. దీన్ని బట్టి సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్ఫుల్గా ఉండనుందో అర్థం చేసుకోవచ్చు. గౌరీ హెగ్డే పాత్రకు సంబంధించిన ఒక స్పెషల్ క్యారెక్టర్ గ్లింప్స్ను రేపు (ఆగస్టు 10) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణ రావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, విష్ణు రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమాపై పూరి, విజయ్ సేతుపతి, టబు కాంబినేషన్ కారణంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# సోషల్ మీడియాకు 'ప్రేమలు' బ్యూటీ గుడ్ బై..

## ప్రశాంతతే ముఖ్యమన్న మమితా!



'ప్రేమలు' సినిమాతో ఒక్కసారిగా దక్షిణాది ప్రేక్షకులకు చేరువైన మలయాళ నటి మమితా బైజు కీలక నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియా ఇచ్చే పబ్లిసిటీ కంటే మానసిక ప్రశాంతతే తనకు ముఖ్యమని, అందుకే ఇకపై వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో సినిమా అప్డేట్స్ పంచుకోనని స్పష్టం చేశారు. తన సినిమాలకు సంబంధించిన అన్ని వివరాలు పీఆర్ టీమ్ ద్వారానే వెల్లడవుతాయని తెలిపారు.ఒక ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలతో పాటు పలు ఆసక్తికర సంగతులు పంచుకున్నారు. తాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్కు వీరాభిమానినని, ఆయన సినిమాలను పదిసార్లకు పైగా చూస్తానని చెప్పారు. ముఖ్యంగా 'ఇద్దరమ్మాయిలు' సినిమాలో ఆయన ధరించిన క్యాసియో వాచ్, ఫుల్ స్లీవ్ టీషర్ట్ స్టైల్ను తాను కూడా కాపీ కొట్టేదాన్నని నవ్వుతూ గుర్తుచేసుకున్నారు.కేరళలోని కొట్టాయంలో జన్మించిన మమితా తండ్రి డాక్టర్ కాగా, ఆమె సైకాలజీలో డిగ్రీ పూర్తి చేశారు. తన అన్నయ్య మిథున్ రాష్ట్రస్థాయి క్రికెటర్ అని, తన జీవితంలో అన్ని ముఖ్య నిర్ణయాలు, చివరికి పెళ్లి విషయం కూడా అన్నయ్యే చూసుకుంటాడని తెలిపారు. తనకు వచ్చే లవ్ ప్రపోజల్స్ను కూడా అతనే డీల్ చేస్తాడని చెప్పి ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం సూర్య సరసన 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో పాటు మూడు భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నట్లు మమితా బైజు వివరించారు.

# వైజాగ్‌లో ఏఏఏ మల్టీప్లెక్స్ ప్రారంభం..

## ఇది నాకు చాలా స్పెషల్ అంటూ అల్లు అర్జున్ ట్వీట్




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం తెలిసిందే. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ సినిమాస్‌తో కలిసి ఆయన 'ఏఏఏ సినిమాస్' (అల్లు అర్జున్ ఏషియన్ సినిమాస్) పేరుతో మల్టీప్లెక్స్ లు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఏఏఏ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ స్పందిస్తూ, వైజాగ్ నగరంపై తనకున్న అభిమానాన్ని పంచుకున్నారు."ఈ అద్భుతమైన నగరానికి ఏఏఏ సినిమాస్‌ను తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. నా హృదయంలో వైజాగ్‌కు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇక్కడ ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోంది" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సినిమా వీక్షణ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఎంతో ఇష్టపడి ఈ మల్టీప్లెక్స్‌ను తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కొత్త ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఇప్పటికే ఏఏఏ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు విశాఖపట్నంలో కూడా తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా అల్లు అర్జున్ థియేటర్ వ్యాపారంలో తనదైన ముద్ర వేస్తున్నారు.

# ఆ ప్రాబ్లమ్ వల్లే ప్రమోషన్స్‌కి రాను..

## కానీ యశ్ కోసమే నా నియమం బ్రేక్ చేశా: నయనతార



దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార, తన సినిమాల ప్రమోషన్లకు దూరంగా ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలకు ఆమె హాజరుకావడం చాలా అరుదు. అయితే, తన ఈ నియమాన్ని పక్కనపెట్టి, నిన్న జరిగిన 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఆమె హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను ఎందుకు వచ్చానో కూడా ఈ వేదికపై ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. "నేను ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరుకాకూడదని కాదు. నాకు ఆ పని సరిగ్గా చేతకాదు. అందుకే వాటికి దూరంగా ఉంటాను. కానీ, ఈ కార్యక్రమానికి రావడానికి హీరో యశ్ ఒక్కరే కారణం. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేశారు, ఈ ఈవెంట్‌కు రావడానికి నాకు అది చాలు" అని తెలిపారు. కేవలం యశ్ కోసమే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని స్పష్టం చేశారు. యశ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. "చాలా మంది పెద్ద స్టార్స్ ఉంటారు. కానీ, యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు, తెరపై ఆయనకున్న లార్జర్-దెన్-లైఫ్ ఇమేజ్ నిజ జీవితంలో కూడా కనిపించింది. ఆయన వ్యక్తిత్వం కూడా అంతే గొప్పది" అని ప్రశంసించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన 'టాక్సిక్' చిత్రంలో యశ్, నయనతారతో పాటు కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.







